## క్లుప్తంగా

### ఘనంగా పెద్దమ్మతల్లి పండుగ



బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో ఆదివారం ముదిరాజ్‌ల సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి పండుగ నిర్వహించారు. గోదావరి జలాలను తీసుకొచ్చి గ్రామదేవతలు, పెద్దమ్మ తల్లికి అభిషేకం చేశారు. ఈసందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం వర్షాలు కురిసి పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### భీమన్నకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న సభ్యులు

కుంటాల: కుంటాల శివారు ప్రాంతంలోని భీమన్న ఆలయంలో ఆదివారం ముదిరాజ్ సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. దేవతమూర్తులను (గజాలు, శూలలు)ను గంగాజలాలతో శుద్ధి చేశారు. దీపం, ధూపం, పూలు, నైవేద్యం దేవుడికి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. అనంతరం అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గాల ఎన్నిక



నాయుడువాడలో సన్మానిస్తున్న సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని కాలనీల్లో ఆదివారం పలు సంఘాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. నాయుడువాడ మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని ఆదివారం కాలనీలోని ఆ సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కోతి కంటి లింగన్న, అధ్యక్షుడిగా కోర్తికంటి గంగాధర్, ఉపాధ్యక్షులుగా నాయుడు రమేశ్, ఎల్.రాములు, ప్రధాన కార్యదర్శిగా పి.కృష్ణ, ఉప కార్యదర్శిగా ఆకుల లింగన్న, కోశాధికారిగా ఎన్.రాజేందర్, ఉప కోశాధికారిగా గుండా నరేశ్, సాంస్కృతిక కార్యదర్శిగా పుల్లయ్యగారి రమేశ్, సంయుక్త కార్యదర్శిగా రామ్ సాయినాథ్, ఉపసంయుక్త కార్యదర్శిగా గజ్జ పోశెట్టి, ముఖ్య సలహాదారులుగా రామ్ మహేశ్, తాటికొండ రమేశ్, కూన ప్రసాద్, సభ్యులుగా బొమ్మెన శ్రీను, తోట శిరీష్, పెంట నరసయ్య, గజ్జ కిషన్‌రామ్ రమేశ్ ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

గాజులపేట మున్నూరు కాపు సంఘం కార్యవర్గం అధ్యక్షుడిగా దొంతుల రవి, ఉపాధ్యక్షుడిగా శీలం రాజేశ్వర్, కోశాధికారిగా పోగుల సత్యనారాయణ, కార్యదర్శిగా మంద శ్రీధర్, సహకారదర్శిగా పోగుల భీమేశ్, సలహా సభ్యులుగా పోగుల రాజేశ్వర్, నాకిడి లింగన్న, నాకిడి చిన్నయ్య ఎన్నికయ్యారు.

ప్రియదర్శినినగర్ –సాగర్ కాలనీ కమిటీ అధ్యక్షుడిగా మడిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నోముల శరత్ చంద్రారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా లోకసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కోట సంజీవ, పఠాని నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా ఠాకూర్ ఆనంద్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా అంబేద్కర్ విజయ్‌కుమార్, బద్రి నర్సయ్య, ఉమామహేశ్వర్ రెడ్డి వ్యవహరించారు.

### బాలసంస్కార కేంద్రం ప్రారంభం

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ఆధ్వర్యంలో గణేశ్‌నగర్‌లో బాల సంస్కార కేంద్రం ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు హాజరై మాట్లాడారు. బాల సంస్కారం కేంద్రంలో విద్యార్థులకు భగవద్గీత, రామాయణం, మహాభారతం, మహాపురుషుల జీవిత విషయాలు, నైతిక విలువలు, దేశభక్తి, సంస్కృతి సంప్రదాయాలు, ఆటపాటలతో బోధించనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్, సహ కార్యదర్శి తోట రాము, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



స్టీల్ బాక్స్‌లో మాంసం ఇస్తున్న సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని శ్రీకాలభైరవ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని చింతకుంటవాడ ఆధ్వర్యంలో మహాలక్ష్మీ పండుగ నిర్వహించారు. తమ వాటాగా వచ్చిన మాంసాన్ని(కూరపాళ్లు) కవర్లలో బదులు స్టీల్ టిఫిన్ బాక్స్ ద్వారా సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ..



అంతర్ని వద్ద కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

కుభీర్: ఇటీవలి వర్షాలకు కుభీర్ మండలంలోని అంతర్ని వద్ద భైంసా వెళ్లే రోడ్డు కోతకు గురైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు దెబ్బతిన్న రోడ్డు తెలిసేలా చుట్టూ బండలు ఏర్పాటు చేసి తెలుపు రంగు గీశారు. మరిన్ని వర్షాలు కురిస్తే రోడ్డు మొత్తం కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

### పొంచి ఉన్న ముప్పు



నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని ఒకటో వార్డులో విద్యుత్ స్తంభానికి అమర్చిన మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. చేతికందే ఎత్తులో ఉండటంతో మూగజీవాలతోపాటు మనషులకు విద్యుత్ షాక్ ముప్పు పొంచి ఉంది. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తులో సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### ఇలా వెళ్తే ప్రమాదాలు జరగవా..?



అటవీ ప్రాంతం గుండా బొలేరోలో ప్రమాదకరంగా వెళ్తున్న గంగాపూర్ వాసులు

కడెం: మండలంలోని గంగాపూర్ వాసులు ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. అటు కడెం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో నిర్మించే వంతెన పూర్తికాక.. ఇటు అటవీప్రాంతం(నవాబ్‌పేట్ నుంచి గంగాపూర్ వరకు)లో 14 కిలోమీటర్ల మేర రోడ్డు సరిగా లేదు. దీంతో ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు రోజుకు రెండు ట్రిప్పులే నడుస్తోంది..(వర్షాకాలంలో వరదలకు నడవదు). ఈ మార్గంలో ఆదివారం ఓ ప్రైవేటు వాహనదారుడు పరిమితికి మించి ప్రయాణికులను ప్రమాదకరంగా ఇళ్లకు తీసుకెళ్తున్నాడు.

# వన మహోత్సవానికి సిద్ధం



ఎల్వి నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఏపీవో శివలింగయ్య

- నర్సరీల్లో పంపిణీకి సిద్ధంగా మొక్కలు
- ప్రతీ గ్రామపంచాయతీలో 10 వేలు నాటడమే లక్ష్యం
- నేటి నుంచి కార్యక్రమం ప్రారంభం



కోలూరు నర్సరీలో పంపిణీకి సిద్ధంగా మొక్కలు

తానూరు: మొక్కలు నాటి పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం వన మహోత్సవానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని తానూరు మండలంలో పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తానూరు మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం, పంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు. పంపిణీకి సైతం ఏర్పాట్లు చేశారు. ఒక్కో పంచాయతీ పరిధిలో 10వేల మొక్కలతోపాటు మండలవ్యాప్తంగా 3.10 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కల పెంపకానికి ఉపాధిహామీ పథకం ద్వారా పంచాయతీలకు నిధులు కేటాయించి నర్సరీ నిర్వహణను పంచాయతీలకు అప్పగించారు.

**గ్రామాల్లో అవగాహన...**

వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే సంకల్పంతో అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. మొక్కలతో కలిగే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరిస్తున్నారు. ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించి ఈ ఏడాది మొక్కలు నాటడంలో జిల్లాలోనే మందంజలో ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు. సోమవారం నుంచి మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వకం పనులు చేపట్టారు. వర్షాలు కురిస్తే గ్రామంలోని ఖాళీస్థలాలు, పాఠశాల ఆవరణలో శ్మశానవాటికలతోపాటు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు.

**ఇంటింటికీ ఆరు మొక్కలు..**

మండలవ్యాప్తంగా 3.10 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ముధోల్ మండలం తరోడా గ్రామంలో అటవీశాఖ నర్సరీల నుంచి వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వర్షాలు కురిస్తే అన్ని గ్రామాల్లో ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయనున్నారు. రైతులు పొలం గట్లపై మొక్కలు నాటుకునేవారు ఈజీఎస్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారు.

**వందశాతం మొక్కలు నాటిస్తాం**

మొక్కల పెంపకంతో పర్యావరణానికి మేలు జరుగుతుంది. మండలంలోని నర్సరీల్లో మూడు లక్షలకు పైగా మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే గ్రామాల్లో మొక్కల నాటితే కలిగే ప్రయోజనాలపై ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించాం. నాటిన మొక్కలను సంరక్షిస్తూనే.. వర్షాలు కురువగానే వంద శాతం మొక్కలు నాటిస్తాం.

– శివలింగయ్య, ఈజీఎస్ ఏపీవో

# శిథిల భవనాలు కూల్చేయరూ



సిర్పెల్లిలో కూలేందుకు సిద్ధంగా పాఠశాల పాత భవనం



దార్‌కుభీర్ పాఠశాల పాత భవనం దుస్థితి



రాజురాలో బీటలు వారిన భవనం

- ఒకే ఆవరణలో కొత్త బడులు
- విద్యార్థులకు పొంచి ఉన్న ముప్పు
- తొలగించాలంటున్న గ్రామస్తులు

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన పాఠశాలల పాతభవనాలు ప్రమాదకరంగా మారాయి. ఇవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ శిథిల భవనాలు ప్రస్తుతం విద్యార్థులు చదువుతున్న పాఠశాలల ఒకే ఆవరణలో ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఆటలు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇటీవల కుభీర్ మండలం అంతర్ని గ్రామంలో శిథిలావస్థకు చేరిన భవనం కూలి సాయికుమార్, ప్రేమ్‌కుమార్ అనే ఇద్దరు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిల పాఠశాలల భవనాలు కూల్చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

**కుభీర్ మండలంలో 24 శిథిల భవనాలు..**

మండలంలోని 42 పంచాయతీల పరిధిలో సుమారు 70 వరకు గ్రామాలున్నాయి. మండలంలో మండల పరిషత్తు పాఠశాలలు 74 ఉండగా వీటిల్లో 24 పాఠశాలల పాత భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటితో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మండలంలో పల్సి, సొనారి, బెల్గాం, ధార్‌కుభీర్, రాజురా, అంతర్ని, నిగ్వా, సిర్పెల్లి తదితర గ్రామాల్లో చోట్ల పాఠశాలల పాత భవనాలు ప్రమాదకరంగా మారాయి. ఇవేకాక కుభీర్‌లో మండల విద్యావనరుల కేంద్రం భవనం సైతం కొంత కూలింది. నిగ్వాలో ఎస్సీ హాస్టల్ పాత భవనం, కుభీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన డాక్టర్స్ క్వార్టర్స్ భవనం ఉంది. ఇప్పటికైనా పాత భవనాలు కూల్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**పాతభవనం కూల్చివేయాలి**



మా గ్రామంలో పాఠశాలకు నూతన భవనం నిర్మించారు కాని అందులో తరగతులు నిర్వహించడం లేదు. పాఠశాల పాత భవనం పక్కనే రెండు గదులు నిర్మించారు. ప్రస్తుతం బడి అక్కడే నడుస్తుంది. పాత భవనం కూలితే ఒకే ప్రాంగణంలో ఉండే విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

– తోకల మారుతి, దార్‌కుభీర్

**వివరాలు సేకరించాం**

ప్రభుత్వం మండలంలోని పాఠశాలల పాత భవనాల వివరాలు పంపమని ఆదేశించింది. ఇప్పటికే తాము పంచాయతీ కార్యదర్శుల ద్వారా వివరాలు సేకరించాం. సోమవారం నుంచి పాతభవనాలను కూల్చే పని ప్రారంభిస్తాం.

– ఆర్.విజయ్‌కుమార్, కుభీర్ ఎంఈవో

# వర్షాలు కురువాలని పూజలు



ధర్మోరలో ఆలయానికి వెళ్తున్న భక్తులు



లక్ష్మణచాంద : ఆలయానికి వెళ్తున్న సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి, ధర్మోరా, పంచగుడి, గొడిసెరా తదితర గ్రామాల్లో ఆదివారం ఆరెల్లి మైసమ్మ పండుగ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లి గ్రామస్తులు పూజలు చేశారు. సమీపంలోని గోదావరి జలాలను తీసుకొచ్చి తీసుకువచ్చి గ్రామ దేవతలకు అభిషేకం నిర్వహించారు. వర్షాలు కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. వీడీసీ సభ్యులు నారాయణ్‌రెడ్డి, ప్రశాంత్, శ్రీనివాస్‌గౌడ్, భూమన్న, నర్సయ్య, అనిల్‌పటేల్, సాయన్న, గంగాధర్ ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో నల్ల పోచమ్మకు పలు కులసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

**గ్రామ దేవతలకు పూజలు**

ముధోల్: మండలకేంద్రంతోపాటు మండలంలోని బోరిగాం, ఆష్ట, రువ్వి తదితర గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రజలు పూజలు చేశారు. మండలకేంద్రంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో మంద పోచమ్మ పండుగ నిర్వహించారు.

లక్ష్మణచాంద: వర్షాలు కురువాలని మండలకేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. విత్తనాలు విత్తిన రైతులు వరుణుడి రాక కోసం ఎదురుచూస్తున్నారు. వీడీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరం ఉండాలి



సారంగాపూర్ : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



నిర్మల్‌రూరల్: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సారంగాపూర్: యువత మత్తు పదార్థాలకు దూరం ఉంటూ.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. ఎస్పీ జానకీషర్మిళ ఆదేశాల మేరకు మండలంలోని స్వర్ణ గ్రామంలో మత్తుపదార్థాల నివారణ వారోత్సవాలు నిర్వహించారు. వీధుల్లో ర్యాలీ తీస్తూ మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు వినోద్‌మాధవ్, వినీల్, హోంగార్డు ఎక్బాల్ ఉన్నారు.

**‘మత్తు’ బారిన పడొద్దు**

నిర్మల్‌రూరల్: యువత, ప్రజలు మత్తు పదార్థాల బారిన పడి వారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని రూరల్ ఎస్సై లింబాద్రి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ నగర్ కాలనీలో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరం ఉండి.. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. ఇందులో సిబ్బంది అజీజ్, చారి, శ్రీకాంత్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆదివారం ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు వినియోగిస్తే కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మోటివేషనల్ స్పీకర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకంతో ఎదురయ్యే అనారోగ్య సమస్యలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఏ గఫార్ తదితరులు ఉన్నారు.

# గిరిపుత్రుల ఆశాదీపం ‘ఇప్ప’



ఇప్పగింజలను పగులగొడుతున్న మహిళ



ఇప్పగింజలు

కడెం: గిరిపుత్రులకు అడవితల్లే ఆధారం..అటవీ ఉత్పత్తులు వారి జీవనంలో భాగం. ప్రకృతిఒడిలో పెరిగే ఇప్ప చెట్ల నుంచి సేకరించిన ఇప్పకాయలను పగులగొట్టి వాటిల్లోంచి గింజలను తీస్తారు. అనంతరం ఇప్పగింజలను పగులగొట్టి పరకను గిర్నీలో పట్టించి నూనెను తీస్తారు. ఈ నూనె దీపారాధనకు, దీపాలు వెలిగించుకునేందుకు ఉపయోగిస్తారు. ఈనూనె దీపం అధిక వెలుతురునివ్వడంతోపాటు ఎక్కువ సమయం వెలుగుతుందని మండలంలోని పునరావాస కాలనీ మైసంపేటకు చెందిన చిక్రం రాంబాయి అనే గిరిజన మహిళ పేర్కొన్నారు.

# ‘ఉద్యమకారులకిచ్చిన హామీలు నెరవేర్చాలి’

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టె శేఖర్ ఒక ప్రకటనలో కోరారు. వందలాది మంది ఆత్మ బలిదానాల సాక్షిగా వేలాదిమంది అన్నింటిని వదులుకొని లక్షలాది మందిని ఒక్కటిగా చేర్చి ఉద్యమాలు చేస్తేనే స్వరాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాసరావు వినతి మేరకు ఉద్యమకారులను గుర్తించేందుకు సీఎం ఒక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. గుర్తించిన ఉద్యమకారులకు ప్రభుత్వం 250 చదరపు గజాల స్థలంతోపాటు ఇంటి నిర్మాణం, బస్సుపాసుల్లో రాయితీ, సర్వం కోల్పోయిన ఉద్యమకారులకు రూ.25 వేల పెన్షన్ మంజూరు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉద్యమకారులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినం వరకు చేపట్టే ఉద్యమాలకు ఉద్యమకారులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

### అగ్నివీర్ అభ్యర్థులకు మాక్‌టెస్ట్

భైంసాటౌన్: పట్టణంలోని పులేనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం అగ్నివీర్ అభ్యర్థులకు మాక్‌టెస్ట్ నిర్వహించారు. పట్టణానికి చెందిన శ్రీ సాయిసుప్రియ ఆస్పత్రి వైద్యులు రజనీకాంత్, సోల్జర్ గ్రూప్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు 168 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈనెల 30న నుంచి అగ్నివీర్ అభ్యర్థులకు పరీక్షల నేపథ్యంలో మాక్‌టెస్ట్ నిర్వహించినట్లు వెల్లడించారు.

### నేడు ‘రచ్చబండ’

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు ఉపేందర్, మనోజ్ తెలిపారు. పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి ఎంపీ నగేష్‌తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ తదితర ముఖ్య నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.

**చెక్కు అందజేత**

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన షెట్‌పెల్లి జయశీలకు రూ.60 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే బొజ్జు ఆదేశాలతో ఆదివారం ఆ పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. జన్నారపు శంకర్, శివ ఉన్నారు.